క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం


నగదు అందిస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్య అన్నదానానికి సోమవారం ఓ దాత నగదు విరాళం అందించారు. చిత్తూరుకు చెందిన దీక్షిత్ అనుదీప్ రూ.50వేలు విరాళం ఇచ్చారు. ఆయనకు ఆలయ సిబ్బంది దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం తనిఖీ


భవిత కేంద్రంలో జయప్రకాష్‌నాయుడు

తవణంపల్లె: భవిత కేంద్రాన్ని సోమవారం సమగ్రశిక్ష సహిత విద్య కో–ఆర్డినేటర్ జయప్రకాష్‌నాయుడు, తవణంపల్లె ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి తనిఖీ చేశారు. భవిత కేంద్రంలోని పిల్లల హాజరు, సహిత విద్యా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను ప్రారంభించారు. భవిత కేంద్రంలో పిల్లల నమోదు చేయించాలని సూచించారు. ప్రత్యేక అవసరాల పిల్లలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని సూచించారు. కార్యక్రమంలో ఐఈడీ ఎస్ఎస్ నాగభూషణం, ఐఆర్పీలు దేవేంద్ర, దిలీప్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి


పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: మండలంలోని పుణ్యసముద్రంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ 35 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు, ఉపాధ్యాయులు

తవణంపల్లె: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సాధికార వారోత్సవాల్లో భాగంగా సోమవారం తవణంపల్లె ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జెండర్ ఈక్వాలిటీ అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 8వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఐసర్ ఎక్స్‌పోలో విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ మనోహర్

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఐఐఎస్ఈఆర్ సైన్స్ ఎక్స్‌పోలో ప్రశంసాపత్రాలు సాధించడం అభినందనీయమని ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. సోమవారం ఆ కళాశాలలో విద్యార్థినులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇటీవల జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి ఐసర్‌లో సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారన్నారు. ఈ ప్రదర్శనలో తమ కళాశాలకు చెందిన జాయ్స్, అఫియా, దివ్య, జాహ్నవి, రమ్య ప్రతిభ చూపి సర్టిఫికెట్లు సాధించడం గర్వకారణమన్నారు. ఎక్స్‌పోలో వ్యాధి నిర్ధారణలో మోనోక్లోనల్ యాంటీబాడీల పాత్ర, బయోరెమిడియేషన్‌కు సంబంధించిన ప్రయోగాలను ప్రదర్శించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర, అధ్యాపకులు తిరుకుమరన్, నాగరాజు, శివరాగిణి, కోమలాదేవి పాల్గొన్నారు

మహిళా చైతన్యానికి సదస్సులు

చిత్తూరు అర్బన్ : మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు చిత్తూరు పోలీసుశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో మహిళా పోలీసులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పోలీసుల పనితీరు, విపత్కర పరిస్థితుల్లో ఉపయోగించే ఆయుధాల వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లింగ సమానత్వంపై ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా కనీస అవగాహన కలిగి ఉండాలని కోరారు.

దంప్ చేసిన ఇసుక



రాత్రి వేళ జేసీబీలతో ఇసుక తవ్వకాలు, టిప్పర్లతో తరలిస్తున్న దృశ్యం





అర్ధరాత్రి.. ఇసుక అక్రమ రవాణా!

- బహుదానది ఒడ్డున జోరుగా తవ్వకాలు
- టిప్పర్ల ద్వారా పక్క రాష్ట్రాలకు తరలింపు
- కూటమి నేతల కనుసన్నల్లోనే అక్రమ వ్యాపారం

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి నేతల ఇసుక దందాకు తెరలేపుతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొల్లగొడుతున్నారు. చీకటి వేళ టిప్పర్లకు రైట్ రైట్ చెబుతున్నారు. ఇలా పక్క రాష్ట్రాలకు ఇసుక తరలిస్తూ, లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. తవణంపల్లె మండలం మైనగుండ్లపల్లిలో ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. చీకటి పడితే బహుదానదిలో అక్రమార్కులు రాజ్య మేలుతున్నారు. కూటమి నేతలు గ్రూపుగా ఏర్పడి ఈ దందాకు తెరలేపుతున్నారు. దర్జాగా జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేసుకుంటున్నారు. ప్రధానంగా టిప్పర్ల ద్వారా తెల్లబంగారాన్ని దోచుకుంటున్నారు. రోజూ పదుల సంఖ్యల్లో టిప్పర్ల ఇసుక తరలుతోంది. పక్కరాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక టిప్పర్ రూ.లక్ష వరకు అమ్ముకుంటున్నారు. ఈ అక్రమ వ్యాపారాన్ని అడ్డుకుంటారని పలువురు అధికార పార్టీ నాయకులు అక్కడే కాపలా కాస్తున్నారు. చీకటి పడితే ఇసుక తవ్వకాల వద్దే తిష్ట వేస్తున్నారు. ఎవరైనా అడ్డొస్తే బెదిరింపులకు గురి చేస్తున్నారు. నోరు మెదపకుండా చేస్తూ.. వ్యాపారానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా అడ్డు తొలగించుకుంటున్నారు. ఇలా రాత్రి 7 గంటల నుంచి వేకువజామున 4 గంటల వరకు ఈ అక్రమ తవ్వకాలు, రవాణా జోరుగా సాగుతున్నాయి. అలాగే ఆ పరిసర ప్రాంతాల్లో డంప్‌లు ఏర్పాటు చేసుకుని డిమాండ్ వచ్చినప్పుడు అమ్ముకుంటున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు


పరీక్ష కేంద్రాలను తనిఖీచేస్తున్న సీఐ శ్రీధర్

గుడిపాల: ఇంటర్ మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఆయన సోమవారం బొమ్మసముద్రం కళాశాలలో ఇంటర్ మీడియట్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే తమకు తెలియజేయాలని కోరారు. ఇంటర్ మీడియట్ సెకండియర్‌లో 69 మందికి గాను 67 మంది పరీక్షకు హాజరయ్యారు.

చికెన్‌పై అపోహలు వద్దు.. ఇష్టంగా తినండి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చికెన్, కోడిగుడ్లపై అపోహలు వద్దని జేసీ విద్యాధరి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని ఓ ఫ్యాక్టరీ ఆవరణలో సోమవారం నెక్(నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ) ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జేసీ, నెక్ నాయకులు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్క జిల్లాలో మాత్రమే బర్డ్‌ఫ్లూ ఉందని, మిగిలిన చోట్ల ఎక్కడ కూడా ఆ కేసులు లేవన్నారు. దీనిపై ప్రజలు భయపడాల్సిన పని లేదన్నారు. అపోహలు వీడి చికెన్ ముక్కను ఇష్టంగా ఆరగించవచ్చన్నారు. అనంతరం ప్రజలకు ఉచితంగా చికెన్‌తో చేసిన వంటకాలు, గుడ్లు పంపిణీ చేశారు. మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, నాయకులు దొరబాబు పాల్గొన్నారు.

ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి


సమస్యలు వింటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడ్డ వాటిని ప్రాధాన్యత ఆధారంగా గుర్తించాలన్నారు. ఇతర వినతులను తక్షణం పరిశీలించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్, టిడ్కో, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, మెప్మా విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. ఈ గ్రీవెన్స్‌లో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ అధికమవుతున్నాయని, ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 55 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వెళ్లాలన్నారు. పండ్ల రసాలు, కొబ్బరి నీరు, నీరు అధికంగా తీసుకోవాలని చెప్పారు. ఆరోగ్య సిబ్బంది పంపిణీ చేసే ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీటిలో కలిపి తాగాలన్నారు. వడదెబ్బకు గురైతే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీ లేదా వైద్యులను సంప్రదించాలన్నారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారుల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుల జాబితా విడుదల చేయాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : స్పెషల్ ఎడ్యుకేషన్, దివ్యాంగుల (ప్రత్యేక ప్రతిభావంతు) సీనియారిటీ జాబితాలను విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ కోరారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం నాయకులు డీఈవో వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ సబ్జెక్టుకు అర్హత ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్లు జిల్లాలో ఉన్నారని చెప్పారు. వారికి సంబంధించిన సీనియారిటీ జాబితాను విడుదల చేయాలని కోరారు. వివిధ సబ్జెక్టుల్లో ప్రత్యేక ప్రతిభావంతుల ఉద్యోగోన్నతులకు కేటాయించిన పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు.

కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా సీనియారిటీ కల్పించాలి

జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్ మాట్లాడుతూ డీఎస్సీ 2002లో ల్యాంగ్వేజ్ పండింట్ హిందీలుగా ఎంపికైన 19 మంది, 2005, 2006లో నియామకం పొందిన వారికి డీఎస్సీ 2002 టీచర్లతో సమానంగా నోషనల్ సీనియారిటీని కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా కల్పించాలన్నారు. డీఎస్సీ 2002 అప్రెంటిస్ టీచర్లకు కామన్ సీనియారిటీ 03-03-2003 గా పరిగణించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లపై డీఈవోతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రెడ్డెప్ప, ఎస్పీ బాషా, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ కార్యాలయం తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయాన్ని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ సోమవారం పరిశీలించారు. ప్రహరీలోని అన్ని కార్యాలయాలను తనిఖీ చేశారు. త్వరలో రూరల్-3 డీఈ కార్యాలయం రెడ్డిగుంటకు మారనుంది. అక్కడ ఏ కార్యాలయం కేటాయించాలని అధికారులతో మాట్లాడారు. శిథిలావస్థకు చేరిన ఈఆర్వో కార్యాలయాన్ని కొత్తగా నిర్మిస్తే అంతవరకు బిల్లింగ్ కౌంటర్, సిబ్బంది ఎక్కడ ఉండాలని అధికారులతో సమాలోచన చేశారు. మొత్తం డివిజన్ కార్యాలయంలో ఉన్న గదులు అక్కడ ఉన్న విభాగాల వివరాల గురించి ఈఈ మునిచంద్ర తెలియజేశారు. ఏ గదులను ఎవరికి కేటాయించాలో నిర్ణయించనున్నట్లు ఎస్ఈ పేర్కొన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ జగదీష్, డీఈలు ప్రసాద్, ఆనంద్, ఏఏఓ గీత, జేఏఓ గోవిందరాజులు పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం


తవణంపల్లెలో ప్రెస్‌క్లబ్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

తవణంపల్లె: సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని పారిశ్రామికవేత్త, అర్ధగిరి ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఏపీయూడబ్ల్యూజే అనుసంధానంతో నూతనంగా ఏర్పాటు చేసిన తవణంపల్లె ప్రెస్‌క్లబ్‌ను పైమాఘం సుగుణాకర్ రెడ్డి, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రెడ్డిబాబు, ఎస్ఐ చిరంజీవి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సుగుణాకర్ రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తామన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు లోకనాథం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అశోక్‌కుమార్, ఏపీఎం రవి ప్రసంగించారు. తవణంపల్లె ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా జగన్నాథం, సెక్రటరీగా అనంతకుమార్, కోశాధికారిగా జీవన్‌కుమార్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు రామకుమార్, గజేంద్ర, రాజశేఖర్, రాజా, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యత



బంగారుపాళెంలో ర్యాలీ చేస్తున్న మహిళా పోలీసులు, ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది

బంగారుపాళెం: మహిళల రక్షణ, భద్రతపై ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఐ శ్రీనివాసు లు అన్నారు. అంతర్జాతీయ మహిళ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక బంగారుపాళెంలో ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, సమాజంలో యువతులు, మహిళలు, మహిళా ఉద్యోగు ల పట్ల మర్యాదగా నడుచుకున్నప్పుడే వారికి నిజమైన స్వేచ్ఛ అని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం పోలీస్‌శాఖ అనేక చట్టాలను తీసుకు వచ్చిందన్నారు. అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళా సంరక్షణ కార్యదర్శుల (మహిళా పోలీసుల)కు ప్రత్యేక మెడికల్ క్యాంప్‌ను నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు.

పుష్పపల్లకిపై మొగిలీశ్వరస్వామి


విశేషాలంకారంలో ఉత్సవమూర్తులు


పుష్పపల్లకిపై విహరిస్తున్న కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి

బంగారుపాళెం: మొగిలి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు సోమవారం రాత్రి శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ పుష్పపల్లకిపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకపూజలు చేశారు. రాత్రి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పుష్పవాహనంపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ పుర వీధుల్లో మేళతాళాల నడుమ స్వామి, అమ్మవారు విహరిస్తూ భక్తులకు దివ్యాశీసులు అందజేశారు. పుష్ప పల్లకి ఉత్సవానికి బొమ్మాయిపల్లెకు చెందిన మమత, ఈశ్వర్‌నాయుడు దంపతులు ఉభయ దారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, ప్రధాన అర్చకులు రెడ్డెప్పగురుకుల్, అర్చకులు విశ్వనాథగురుకుల్, హరికేష్ గురుకుల్, మంజునాథ్ గురుకుల్, పవన్ గురుకుల్, సోమశేఖర్ గురుకుల్, దండపాణి గురుకుల్ పాల్గొన్నారు.

నేడు ధ్వజావరోహణం

మొగిలీశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సూర్య ప్రభ వాహనం, సాయంత్రం వసంతోత్సవం, త్రిశూలస్నానం, ధ్వజావరోహణం, రాత్రి చంద్ర ప్రభ వాహనం, శయనోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

రథోత్సవ ఆదాయం రూ.1.36 లక్షలు

బంగారుపాళెం: మొగిలీశ్వరస్వామి వారికి రథోత్సవం రోజు వివిధ సేవల ద్వారా రూ1,36,396 ఆదాయం వచ్చినట్లు ఈఓ మునిరాజ తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం చిత్తూరు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించిన రథోత్సవం సందర్భంగా భక్తులు సమర్పించిన వివిధ కానుకలకు సంబంధించి లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీల ద్వారా రూ 43,577, సేవా టికెట్ల విక్రయం ద్వారా రూ.72,225 అన్నదానానికి వచ్చిన విరాళాలు రూ.20,594 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.